
సాక్షి
పల్నాడు
సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024



దుర్గమ్మ సేవలో ..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సినీనటులు కిరణ్ అబ్బవరం, రక్షిత్‌లు ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయఅధికారులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 519.00 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 821.40 అడుగుల వద్ద ఉంది.



స్మృతివనం.. కోలాహలం

విజయవాడలో ఏర్పాటు చేసిన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని వీక్షించేందుకు ప్రజలు తరలివస్తున్నారు. ఆదివారం సందర్శకులతో స్వరాజ్ మైదానం కిక్కిరిసింది.

న్యూస్‌రీల్

ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో తుళ్లూరులోని నేషనల్ అకాడమీ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్స్‌లో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, సూయింట్ మిషన్ ఆపరేటర్ (టైలరింగ్) కోర్సుల్లో టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు రెండు నెలలపాటు ఉచిత నైపుణ్య శిక్షణ కల్పించి, స్థానిక, వివిధ రాష్ట్రాల్లోని పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కలిస్తామని తెలిపారు. విద్యార్హతల ఆధారంగా ఆయా కోర్సులకు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు తమ ప్రతినిధులు వెంకట్ (95057 19172), జ్యోతిర్మయి (98482 55009)ను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు



విజయాద కల్చరల్: స్థానిక దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో వారం రోజులుగా జరుగుతున్న శ్రీత్యాగరాజ స్వామి ఆరాధానా సంగీతోత్సవాలు ఆదివారం ముగిశాయి. సంగీత సన్మండలి సంగీత సంస్థ, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చివరి రోజు నగరానికి చెందిన వందమందికి పైగా సంగీత విద్వాంసులు త్యాగరాజ స్వామి రచించిన ఘన రాగ పంచరత్న కీర్తనలు జగదానంద కారక, దుడుకు గల నన్నే, సాధించినే, కనకనరుచిరా, ఎందరో మహానుభావులు కీర్తనలను ఏకకాలంలో స్వరం తప్పకుండా గానం చేశారు. కార్యక్రమంలో మోదుమూడి సుధాకర్, అంజరా సుధాకర్, వేమూరి విశ్వనాథ్, భమిడిపాటి శ్రీలలిత, పోపూరి గౌరీనాథ్, దర్భా మృదురవళి, సద్గురు చరణ్ ఫల్గుణ్ తోపాటు పలువురు సంగీత విద్వాంసులు గోష్ఠిగానంలో పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. తెల్లవారు జాము నుంచే ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, యాగశాలలో నిర్వహించిన చండీహోమం, శాంతి కల్యాణంతో పాటు సూర్యోపాసన సేవలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఉదయం నుంచే క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మహా మండపం వైపు నుంచి వచ్చే భక్తుల క్యూలైన్ ఆరో అంతస్తు వరకు, ఇటు ఘాట్‌రోడ్డు వైపువచ్చే భక్తుల క్యూ సమాచార కేంద్రం వరకు చేరింది. మహా నివేదన అనంతరం క్యూలైన్లు త్వరత్వరగా నడిచేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత రూ. 500 అంతరాలయ దర్శనం క్యూలైన్ కాసింత రద్దీ తగ్గడంతో రూ. 300 టికెటు తీసుకున్న భక్తులకు బంగారు వాకిలి దర్శనం కల్పించారు. దీంతో క్యూలైన్‌లో భక్తుల తాకిడి తగ్గింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు పాల్గొన్నారు.

13 నుంచి సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ ఇన్‌చార్జి, అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్ బాబు ఆదివారం ఆవిష్కరించారు.

ఆనందాలు డబుల్!

రూ.148.95కోట్ల వ్యయంతో అమరావతి – బెల్లంకొండ డబుల్ రోడ్డు

- సాకారమవనున్న నియోజకవర్గ ప్రజల ముప్పై ఏళ్ల కల
- గతేడాది జూన్ 12న శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్
- దశాబ్దాలుగా పట్టించుకోని నేతలు
- ఫలించిన ఎమ్మెల్యే శంకరరావు నిరంతర కృషి
- మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తి
- రోడ్డు వెంట పెరిగిన భూముల ధరలు



క్రోసూరు వద్ద పూర్తయిన రోడ్డు

అమరావతి: మూడు మండలాలను కలుపుతూ అమరావతి నుంచి బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు డబుల్ రోడ్డు నిర్మించాలన్నది పెదకూరపాడు నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ. ఎందరో నేతలు హామీ ఇచ్చి, ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేసి, ఆనక వెన్నుచూపారు. అయితే 2019 ఎన్నికల ప్రచారంలో అమరావతి నుంచి క్రోసూరు మీదుగా బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తానని అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు ప్రజలకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసినప్పటినుంచి రోడ్డు నిర్మాణానికి కృషి చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రభుత్వ ఉన్నతాధికారులు, మంత్రులకు నియోజకవర్గ అభివృద్ధికి ఈ రోడ్డు ఎంత అవసరమో ఎమ్మెల్యే శంకరరావు వివరించి సాధించారు.

ముప్పై ఏళ్ల కల సాకారం..

రవాణా అవసరాలు, వాహనాలు, పెరిగినప్పటికీ మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్డు అలాగే ఉండిపోయింది. గతంలో ఇక్కడ నుంచి గెలిచినవారు రహదారి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎన్నికలలో ఇచ్చిన హామీ నెరవేర్చటం కోసం నిరంతరం అధికారులను మంత్రులను కలుస్తూ రహదారి ఆవశ్యకతను వివరించారు. గతేడాది జూన్ 12వతేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన నిర్వహించారు.

తెలంగాణకు ఇదే దగ్గరిదారి..



ధరణికోట వద్ద నిర్మాణంలో ఉన్న అమరావతి - బెల్లంకొండ డబుల్‌రోడ్డు

అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట మండలాల ప్రజలు పల్నాడుకు వెళ్లాలన్నా, అలాగే తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు వెళ్లాలన్నా ఇదే దగ్గరిదారి. అమరావతి – బెల్లంకొండ రోడ్డుతో పాటు, మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే దూరం తగ్గడమే కాకుండా సమయం, డబ్బు ఆదా అవుతుంది. అలాగే తెలంగాణ నుంచి నాపరాయి, సిమెంట్ రవాణాకు, పలు జిల్లాల్లో డిమాండ్ ఉన్న అమరావతి ఇసుక రవాణాకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది.

ప్రాథమిక దశలో మాదిపాడు బ్రిడ్జి నిర్మాణం

ఎన్నో ఏళ్లుగా కృష్ణా జిల్లాకు, పల్నాడు జిల్లాను కలుపుతూ కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం జరగాలన్న ఇరువైపు ప్రజల కలలను ప్రభుత్వ సహకారంతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నిజం చేస్తున్నారు. నాబార్డు నిధులు సుమారు రూ.65కోట్లతో నిర్మాణం చేయాలని ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయగా ప్రస్తుతం డీపీఆర్ స్థాయి దాటి టెండర్ల ప్రక్రియ పూర్తయింది.

భూముల ధరలు పెరిగాయి..

అమరావతి–బెల్లంకొండ డబుల్‌రోడ్డు మొదలుపెట్టిన నాటి నుంచి గ్రామాలలో ఈరోడ్డు వెంబడి పొలాల ధరలు పెరుగుతున్నాయి. ఆయా మండలాలలో నిర్మాణం జరుగుతున్న ఈ రోడ్డు వెంబడి భూములు కొనటానికి రియల్టర్లు ముందుకు వస్తున్నారు. గుంటూరు, సత్తెనపల్లి, నర్సారావుపేట, పిడుగురాళ్ల తదితర ప్రాంతాల నుంచి భూములు కొనటానికి వస్తున్నారు. గతంలో ఎకరా రూ.30లక్షల నుంచి రూ.40లక్షలు ఉంటే ప్రస్తుతం రూ. 50లక్షల నుంచి రూ.60లక్షల ధర పలుకుతుంది.

నిధులు మంజూరు ఇలా..

సుమారు 50 కిలోమీటర్లు పైగా నిర్మితమయ్యే ఈ రహదారి అంచనా వ్యయం రూ.148.95 కోట్లుగా నిర్ధారించారు. నాబార్డు ద్వారా రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.100.68కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటాధనం కింద రూ.48.26కోట్లు మంజూరు చేశారు. రాష్ట్రప్రభుత్వం పరిపాలనా, ఆర్థిక అనుమతులు పూర్తవ్వటంతో టెండర్ల ప్రక్రియ దాటుకుని నేడు తారురోడ్డు క్రోసూరు నుంచి అమరావతి వరకు పూర్తయింది. దీంతో తమ ముప్పై ఏళ్ల కల సాకారం అవుతోందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కల నెరవేరింది..



దశాబ్దాలుగా ఈరోడ్డు సింగిల్‌రోడ్డు కావటంతో ఎన్నో ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఈరోడ్డు వెంబడి గ్రామాలలోనే ఇసుకరీచ్‌లు ఉండటం ఇసుక కోసం వచ్చే భారీ వాహనాలు తిరుగుతుండటంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. డబుల్ రోడ్డు కోసం గతంలో నాయకులను కోరినా ఉపయోగం లేదు. ఎమ్మెల్యే శంకరరావు పట్టుదలతో రోడ్డు మంజూరు చేయించి, నేడు మా కల నెరవేర్చారు. ఆయనపై నమ్మకం రెట్టింపైంది.

– మాదాసు రాంబాబు,
ధరణికోట, అమరావతి మండలం

రోడ్డు నిర్మాణం పూర్తిచేయడం ఆనందంగా ఉంది..



నియోజవర్గంలో ప్రజలందరికీ గతఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం అమరావతి నుంచి బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం జూన్‌లో మొదలు పెట్టి పూర్తిచేయటం ఆనందంగా ఉంది. అలాగే మాదిపాడు వద్ద కృష్ణానదిపై రూ.65కోట్లతో బ్రిడ్జి నిర్మాణం టెండరు ప్రక్రియ పూర్తయితే పనులు ప్రారంభించాల్సి ఉంది. నా హామీ నిలబెట్టటం కోసం రూ.148.95కోట్లు నిధులిచ్చి సహకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఆయన అడుగుజాడల్లో నడిచే నన్ను నియోజకవర్గ ప్రజలు అండగా ఉండి మరొక్కసారి ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను.

– నంబూరు శంకరరావు,
ఎమ్మెల్యే, పెదకూరపాడు

జిల్లాలో ముమ్మరంగా రేషన్ పంపిణీ

- నాలుగురోజుల వ్యవధిలో 28.49శాతం ప్రజలకు అందజేత
- ఈనెల 17వరకు పంపిణీ



నరసరావుపేటలో జరుగుతున్న రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ పద్మశ్రీ

నరసరావుపేట: పేద ప్రజల ఆహార భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యం, ఇతర నిత్యావసరాలు ఆదివారం నాటికి జిల్లాలో 28.49శాతం పంపిణీ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్. పద్మశ్రీ వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 1290 రేషన్‌షాపులు ఉండగా 402 ఎండీయూ వాహనాల ద్వారా డీలర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నారన్నారు. మొత్తం 6,48,348 కార్డుదారుల్లో రేషన్ బియ్యం 1,84,738మందికి, ఆటా 25,773మందికి, కందిపప్పు 49,219మందికి, పంచదార 1,55,678మందికి పంపిణీ చేశామన్నారు. ఇప్పటివరకు జిల్లాలోని 28 మండలాల్లో అత్యధికంగా క్రోసూరు మండలంలో 38.80శాతం మందికి పంపిణీ చేయగా, అత్యల్పంగా రెంటచింతలలో 18.35శాతం మందికి పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఈనెల 17వ తేదీ వరకు రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదు ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ ప్రదేశాల్లో రేషన్ పంపిణీ తనిఖీ చేస్తున్నామని ఆమె తెలిపారు.

11న బాడీ బిల్డింగ్ పోటీలు

పెనమలూరు: ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీబిల్డింగ్ పోటీలు ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తున్నామని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఈదా రాజేష్, అధ్యక్షుడు బి.మనోహర్, కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. కానూరులో ఆదివారం వివరాలు తెలుపుతూ ఈ నెల 11వ తేదీన 11వ మిస్టర్ ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీబిల్డింగ్ పోటీలు కానూరు అశోక్ జిమ్ సహకారంతో గ్లోబల్ కిడ్స్ పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు, సర్టిఫికెట్‌లు, పతకాలు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8686771358, 9985182645లో సంప్రదించాలన్నారు.

మరియమాతను ఆశ్రయిస్తే దీవెనలు

గుణదల (విజయవాడ తూర్పు): మరియమాతను ఆశ్రయించిన భక్తులకు సకల దీవెనలు లభిస్తాయని ఏలూరు మేత్రాసన గురువు ఫాదర్ తోట గాబ్రియేలు అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన ప్రార్థనలకు ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ గాబ్రియేలు మాట్లాడుతూ ఆరోగ్య ప్రదాయినిగా మరియతల్లి భక్తుల నీరాజనాలందుకుంటుందని తెలిపారు. మతాలు వేరైనా మానవులంతా ఒక్కటేనని పేర్కొన్నారు. మరియమాత భక్తులందరినీ తన అక్కున చేర్చుకుంటుందని వివరించారు. గుణదల పుణ్యక్షేత్రానికి మత భేదం లేకుండా సకల జనులు వచ్చి మరియ తల్లి దీవెనలు పొందుతారని చెప్పారు. ఏటా జరిగే మరియమాత ఉత్సవాలకు అనేక ప్రాంతాల నుంచి లక్షలాది మంది యాత్రికులు ఈ పుణ్యక్షేత్రానికి చేరుకుని తమ మొక్కుబడులు చెల్లించుకుంటారని తెలిపారు. ఈ ఏడాది శతజయంతి ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా జరగటం విశేషమన్నారు. మరియమాత ఈ పుణ్యక్షేత్రంలో ఆవిర్భవించి నూరు వసంతాలు పూర్తి చేసుకోవడం ఆనందదాయకమన్నారు. అనంతరం సమష్టి దివ్య బలి పూజ సమర్పించి భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందించారు. అంతకు ముందు మఠకన్యలు, భక్తులు పెద్ద సంఖ్యలో కొండ పైన మేరీమాత స్వరూపం వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి మరియమాతను వేడుకున్నారు. కార్యక్రమంలో మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ మరియన్న, ఫాదర్ జాన్ పీటర్ పాల్గొన్నారు.



కొండ పైకి వెళ్తున్న మఠకన్యలు, భక్తులు

సొంత క్యాంపస్‌లోకి జేఎన్‌టీయూ కళాశాల

- నేటి నుంచి కాకాని క్యాంపస్‌లో తరగతులు
- రెండు అకడమిక్ బ్లాక్‌లు, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మాణాలు పూర్తి
- రూ.50కోట్లతో నిర్మాణాలు
- నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
- పాల్గొననున్న రాష్ట్ర మంత్రులు బొత్స, అంబటి, రజిని తదితరులు



నిర్మాణాలు పూర్తిచేసుకున్న అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాకులు

నరసరావుపేట రూరల్: నరసరావుపేటలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను దివంగత మహనేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మంజూరు చేశారు. నరసరావుపేట మండలం కాకాని వద్ద 85.94 ఎకరాల భూమిని గుర్తించి, కళాశాలకు కేటాయించారు. వైఎస్సార్ హఠాన్మరణం తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కళాశాల నిర్మాణాన్ని వదిలేశాయి. దీంతో అద్దె భవనాల్లో 2016 నుంచి తరగతులు నిర్వహిస్తూ వస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కాలంలో కేటాయించిన భూమి చుట్టూ కనీసం ప్రహరీ సైతం నిర్మించలేకపోయింది. సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన వెంటనే జేఎన్‌టీయూ సొంత భవనం నిర్మాణం పురోగతిలోకి వచ్చింది. ఆగస్టు 17, 2020న వర్చువల్ విధానంలో రూ.150 కోట్ల అంచనాలతో నిర్మాణ పనులను ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు పరుగులు పెట్టాయి. దాదాపు రూ.10 కోట్లతో ప్రహరీ నిర్మాణం పూర్తిచేశారు. అనంతరం కళాశాల భవననిర్మాణ పనులు ప్రారంభించారు.

కాకాని క్యాంపస్‌కు తరలింపు..

కాకానిలోని జేఎన్‌టీయూఎన్ కళాశాల భవనాల నిర్మాణ పనులు పూర్తికావడంతో సోమవారం నుంచి పూర్తిస్థాయిలో కళాశాలను ఇక్కడ నుంచే నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నరసరావుపేటలోని ఎన్‌బీటీ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో భవనాలను ఇప్పటివరకు జేఎన్‌టీయూ వినియోగించుకుంది. కాకానిలో భవనాలు సిద్ధం కావడంతో ఇక్కడ నుంచి ఫర్నీచర్‌తో పాటు సామగ్రిని తరలించారు. కాకానిలో మొదటి అకడమిక్ బ్లాక్ పూర్తికావడంతో 2022 ఆగస్ట్ 14 నుంచి మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇక్కడే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు రెండు అకడమిక్ బ్లాక్‌లు అందుబాటులోకి రావడంతో కళాశాలను పూర్తిస్థాయిలో ఇక్కడే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తరగతి గదులు, కంప్యూటర్, ఫిజిక్స్ ల్యాబ్‌లు, మెకానికల్ వర్క్‌షాప్, డ్రాయింగ్ హాల్, లైబ్రరీ, సెమినార్ హాల్, అధ్యాపకుల, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ గదులు సిద్ధమయ్యాయి. ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ ఆడటానికి అనువుగా ఏర్పాట్లు చేశారు. ఇంజినీరింగ్ విద్యలో ఐదు బ్రాంచీలతో గ్రాడ్యుయేషన్ కోర్సులతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంటెక్‌లో రెండు బ్రాంచీల్లో(ఈఈఈ, సీఎస్‌ఈ) 1185 మంది విద్యార్థులకు ఇక్కడ విద్యాబోధన జరుగుతుంది. ఈనెల 5వ తేదీ సోమవారం నిర్మాణాలు పూర్తిచేసుకున్న రెండు అకడమిక్ బ్లాక్‌లను ప్రారంభించనున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ జీవీఆర్ ప్రసాదరాజులు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

రూ.150 కోట్లతో దశల వారీగా నిర్మాణాలు ...

జేఎన్‌టీయూ క్యాంపస్‌ను మొత్తం రూ.150 కోట్లతో దశలవారీగా నిర్మించనున్నారు. ఇందులో మొదటి విడతలో రెండు అకడమిక్ బ్లాక్‌లు, ఓ అడ్మిన్‌స్ట్రేషన్ బ్లాక్‌లతో పాటు సీసీ రోడ్లను రూ.37.48 కోట్లతో నిర్మించారు. దీంతో పాటు వివిధ కోర్సులకు సంబంధించిన ల్యాబ్ పరికరాలు, మౌలిక సదుపాయాల కోసం రూ.10కోట్లు వెచ్చించారు. రెండో దశలో బాలుర, బాలికల కోసం రెండు చొప్పున నాలుగు హాస్టళ్లు రూ.73.69 కోట్లతో 2 వేల మంది వసతి పొందేలా నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. స్పోర్ట్స్ కాంప్లెక్స్ సుమారు రూ.16 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఇండోర్ స్టేడియం సైతం అందుబాటులోకి రానుంది. జేఎన్‌టీయూ ప్రాంగణంలో అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.17 కోట్లు, అతిథి గృహానికి రూ.6.5 కోట్లు వెచ్చించనున్నారు. ఇప్పటికే రూ.10 కోట్లతో ప్రహరీ నిర్మాణం పూర్తికాగా, రూ.9.16 కోట్లు మౌలిక వసతులు, ఇతర పరికరాల కొనుగోలుకు కేటాయించారు.

అన్ని వసతులతో క్యాంపస్ సిద్ధం...

నూతనంగా నిర్మాణం జరుగుతున్న కాకాని క్యాంపస్‌లో సోమవారం నుంచి పూర్తిస్థాయిలో తరగతులను నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు అన్ని వసతులు క్యాంపస్‌లో అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే హాస్టల్ భవనాలు కూడా అందుబాటులోకి వస్తాయి. క్రమశిక్షణ, అంకితభావంతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతాం.

– డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు,
ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూ కళాశాల
నరసరావుపేట

యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్లటమే లక్ష్యం...

పల్నాడు ప్రాంతంలో జేఎన్‌టీయూ లాంటి ప్రతిష్టాత్మక సంస్థ అందుబాటులో ఉండటం విద్యార్థులకు వరం. గత ప్రభుత్వం విస్మరించినా, మా ప్రభుత్వం వేగంగా క్యాంపస్ నిర్మాణపనులు చేపడుతోంది. యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమి, వసతులు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో ఆ కల సాకారం అయ్యేలా కృషి చేస్తాం.

– డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి,
నరసరావుపేట ఎమ్మెల్యే

క్లుప్తంగా

ప్రజాసేవకు అంకితమైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌: డాక్టర్‌ ఉమ్మారెడ్డి



తెనాలి: ఆంధ్రప్రదేశ్‌ అంటే ప్రజాసేవకు అంకితమైన రాష్ట్రంగా దేశవ్యాప్తంగా గుర్తింపుకు నోచుకుందని, ఆ దిశగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలపాల్సిన అవశ్యకత ఉందని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్‌ విప్‌ డాక్టర్‌ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. కొల్లిపరలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన సముదాయం ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ ఆహ్వానం మేరకు డాక్టర్‌ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వైద్యసౌకర్యాలను సమర్థంగా ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ కృషి చేస్తున్నారని చెప్పారు. చేపట్టిన కార్యక్రమాల ఫలితం అందరికీ చెందాలన్నదే ఆయన ఆశయమని తెలిపారు. తెనాలితో తనకు ఎంతో అనుబంధం ఉందని, మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణతో తనకు గల సాన్నిహిత్యాన్ని సభాముఖంగా వివరించారు. ప్రస్తుతం కొల్లిపరకు కాకతాళీయంగా వచ్చినా, రాజకీయంగా తనకు ఈ గ్రామంతో సాన్నిహిత్యం ఉందన్నారు. వైఎస్సార్‌ సీపీకి ఈ గ్రామం వెన్నెముక అని చెప్పారు. భవిష్యత్‌లోనూ ఈ సాన్నిహిత్యం కొనసాగుతుందని కోరుకుంటున్నట్లు వివరించారు. తన పెద్ద కుమారుడు ఉమ్మారెడ్డి వెంకటరమణ గుంటూరు పార్లమెంటు స్థానానికి సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తమ కుటుంబంలో తర్వాతి తరానికి అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ మాట్లాడుతూ ఉమ్మారెడ్డి, తన తండ్రి సత్యనారాయణకు గల సాన్నిహిత్యం గుర్తు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చేబ్రోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి ఘటన ఆదివారం చోటుచేసుకుంది. చుండూరు మండలం మోదుకూరుకు చెందిన చల్లపల్లి విజయ్‌(24) బైక్‌పై గుంటూరు నుంచి స్వగ్రామం బయలు దేరాడు. మార్గంమధ్యలో చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద లారీ ని ఓవర్‌టేక్‌ చేసి ముందు వెళ్తున్న కారును ఢీకొట్టి రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో వెనుక వస్తున్న లారీ విజయ్‌ మీదుగా వెళ్లడంతో అక్కడక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



పట్టణంలోని ఏరియా వైద్యశాలలో పోస్ట్‌ ఆపరేటివ్‌ వార్డును ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ఆధునికీకరించిన పోస్ట్‌ ఆపరేటివ్‌ వార్డును ఆదివారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ వైద్య రంగంలో మునుపెన్నడూ లేని విధంగా అనేక మార్పులు వచ్చాయన్నారు. గతంలో ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లాలంటే వైద్యులు, మందులు సక్రమంగా ఉండవని ప్రైవేట్‌ వైద్యశాలలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఉండేదని పేర్కొన్నారు. వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వైద్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ప్రధానంగా మండలాల్లో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోనే పరిమితం కాకుండా ప్రతి గ్రామానికి వైఎస్సార్‌ హెల్త్‌ క్లీనిక్‌లను ఏర్పాటు చేశారని చెప్పారు. అంతేకాక ఫ్యామిలీ డాక్టర్‌, జగనన్న ఆరోగ్య సురక్షతో ఏ రకమైన రుగ్మతతో బాధపడే వారికైనా అవసరమైన చికిత్స అందించి వారికి మందులు అందించడం జరుగుతుందని వెల్లడించారు. ఒకప్పుడు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో వైద్యులు పూర్తిస్థాయిలో లేక రోగులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులకు స్వస్తి చెప్పి వైద్యులతో పాటు వైద్య సిబ్బంది అందర్నీ నియమించినట్లు చెప్పారు. వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించ డమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నాడు– నేడు పేరుతో వైద్యశాలల రూపురేఖలు మార్చి అవసరమైన భవనాలు నిర్మించడంతో పాటు కావలసిన పరికరాలను అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టే వాటికి తోడుగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ దాతల సహకారంతో జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రసవించిన తల్లీబిడ్డల కోసం పోస్ట్‌ ఆపరేటివ్‌ వార్డును రూ.4 లక్షలతో ఆధునికీకరించారన్నారు. సేవా భావంతో రామకృష్ణ పనిచేస్తున్నాడని కొనియాడారు. ఈ పోస్ట్‌ ఆపరేటివ్‌ వార్డ్‌ వైద్యశాలలో ప్రసవించిన తల్లీబిడ్డలకు అభయంగా ఉంటుందన్నారు. కార్పోరేట్‌ వైద్యశాలలకు ధీటుగా ఏసీల సౌకర్యంతో పోస్ట్‌ ఆపరేటివ్‌ వార్డు తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా ప్రసవించిన తల్లీబిడ్డను ఎన్ని రోజులు పోస్ట్‌ ఆపరేటివ్‌ వార్డులో ఉంచుతారనే విషయాలపై సూపరింటెండెంట్‌ డాక్టర్‌ బి.లక్ష్మణ్‌రావుతో మాట్లాడారు. కమిటీ సభ్యుడు రామకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైఎస్సార్‌ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్‌ మౌలాలి, పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ రావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్‌, ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్‌, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్‌ డాక్టర్‌ బి.లక్ష్మణరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్‌ ఎస్‌.రాజమోహన్‌రెడ్డి, కొవ్వూరి శైలజ, ఆర్‌ఎంఓ శోభారాణి, గైనకాలజిస్టులు సుజాత, సుమిత్రా, నర్సింగ్‌ సూపరింటెండెంట్‌ రాధ ఉన్నారు.

ఆక్వా డెవిల్స్‌ ఆధ్వర్యంలో ఉత్సాహంగా ఈత పోటీలు



విజేతలతో అసోసియేషన్‌ నిర్వాహకులు

తాడేపల్లి రూరల్‌: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఉన్న ఆక్వా డెవిల్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం 24వ కృష్ణానది క్రాస్‌ ఈత పోటీల్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్‌ లైఫ్‌చైర్మన్‌, మాజీ పార్లమెంట్‌ సభ్యులు గోకరాజు గంగరాజు, దివిస్‌ లేబరేటరీ లిమిటెడ్‌ మాజీ డైరెక్టర్‌ దివి మధుసూదన రావు, భారత క్రికెట్‌ కంట్రోల్‌ బోర్డు సెలక్షన్‌ కమిటీ మాజీ చైర్మన్‌ ఎం.ఎస్‌.కె. ప్రసాద్‌, లైలా గ్రూప్‌ కంపెనీస్‌ డైరెక్టర్‌ గోకరాజు ఆదిత్యవర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజయవాడ దుర్గా ఘాట్‌ నుంచి ఈత పోటీలను ప్రారంభించారు. గోకరాజు గంగరాజు మాట్లాడుతూ పోటలను ఆరు కేటగిరీలుగా విభజంచి పురుషులకు, మహిళలకు విడివిడిగా నిర్వహించామని తెలిపారు. మహిళలు కూడా పురుషులతో సమానంగా పోటీ పడ్డారన్నారు. ఆరు కేటగిరీల్లో మొత్తం 66 మంది మహిళలు, 367 మంది పురుషులు కలిపి 433 మంది పాల్గొన్నారని వివరించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి వచ్చారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ స్టేట్‌ డిజాస్టర్‌ సర్వీస్‌ అండ్‌ ఫైర్‌ డిపార్ట్‌మెంట్‌ ఆధ్వర్యంలో 50 మందిని రెస్క్యూ టీమ్‌ కింద పంపారని చెప్పారు. 25వ కృష్ణానది క్రాస్‌ ఈత పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం సమ్మర్‌ కోచింగ్‌ క్యాంపును పిల్లలకు ఉచితంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ, కార్యదర్శి ఎం.ఎల్‌. నరసరాజు, కన్వీనర్‌ అమ్మిరెడ్డి రామిరెడ్డి, కమిటీ, అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

కాపు ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

నెహ్రూనగర్‌: తెలగ, బలిజ, కాపు ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల రాష్ట్ర ఆత్మీయ సమావేశం గుంటూరులోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 45 ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తెలగ, బలిజ, కాపు జేఏసీ కన్వీనర్‌ రాము మాట్లాడుతూ కాపు ఉద్యోగుల్లో ఐక్యత కోసం ఈ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాపు ఉద్యోగుల జేఏసీని ఏర్పాటు చేసి పలు తీర్మానాలు చేసుకోవటం జరిగిందన్నారు. జిల్లా, అసెంబ్లీ స్థాయిలో జేఏసీ కార్యాచరణ సిద్ధం చేయడం , త్వరలో రాష్ట్ర స్థాయిలో 10 మంది రిటైర్డ్‌ ఉద్యోగులు, 10 మంది ప్రొఫెషనల్స్‌, 10 మంది కాపు నాయకులతో కలిసి జేఏసీకి సమాంతరంగా పొలిటికల్‌ కాపు ఉద్యోగుల సహకార సమన్వయ కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ముందుగా శ్రీకృష్ణ దేవరాయులు పట్టాభిషేకం, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం విరూపక్ష పీఠం సుబ్రహ్మణ్యం స్వామీజీ చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామకృష్ణ, పోల్లా నారాయణ, డి శ్రీనివాస్‌, పి పోలేశ్వరరావు, జి వేళాంగి రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మీ గుండెల్లో పెట్టుకోవాలి

ప్రభుత్వ విప్‌ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మీ గుండెల్లో పెట్టుకోవాలని ప్రభుత్వ విప్‌, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సెయింట్‌ జోసఫ్‌స ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్‌ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మండలంలో 738 స్వయం సహాయక సంఘాలకు చెందిన 7,380 మంది అక్కచెల్లెమ్మలకు రూ.7.22 కోట్ల విలువైన చెక్కులను అందచేశారు. పీఆర్కే మాట్లాడుతూ ఆసరా పథకం కింద 4 విడతలుగా మొత్తం రూ.28.89 కోట్లు అందించినట్లు వివరించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలలో నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని పేర్కొన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా మండలంలోని అక్కచెల్లెమ్మలకు రూ.300 కోట్లు నేరుగా వారి ఖాతాలకు జమ చేయడం, మరో రూ.100 కోట్లతో గ్రామాలలో పలు అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. పల్నాడు ప్రాంతానికి ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న వరికపూడిశల ప్రాజెక్టుకు రూ.1273 కోట్లు కేటాయించిన ఘనత జగనన్నదేనన్నారు. నరసరావుపేట చరిత్రలో ఎంపీ అభ్యర్థిగా బీసీ నాయకుడు అనీల్‌కుమార్‌ ఎంపిక చేసిన సీఎం జగనన్నకు ఆయనను అఖండ మెజార్టీతో గెలిపించి బహుమతిగా అందజేద్దామని చెప్పారు. అనంతరం ఎమెల్యే, ప్రభుత్వ విప్‌ పిన్నెల్లి రామకృష్ణా రెడ్డిని వైఎస్సార్‌ సీపీ నాయకులు, డ్వాక్రా మహిళలు పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు కుర్రి సాయిమార్కొండారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సర్పంచి పేర్ల చౌడమ్మ, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ శౌంతిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జిల్లా జేసీఎస్‌ కన్వీనర్‌ మోర్తల ఉమ, ఎంపీడీఓ పి.శంకరరావు, వైస్‌ ఎంపీపీలు ఏరువ శౌర్రెడ్డి, పి.సంపూర్ణమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్‌. భాస్కర్‌రెడ్డి, దుర్గి మార్కెట్‌ యార్డు వైస్‌ చైర్మన్‌ వై.ఇన్నారెడ్డి, మాజీ సర్పంచి ఎ.ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బి. మరియదాసిరెడ్డి, మండల అధ్యక్షుడు పూజల రామయ్య, యూత్‌ మండల అధ్యక్షులు కె.సతీష్‌రెడ్డి, పార్టీ నేతలు మద్దిరాల కృష్ణారెడ్డి, బుడ్డసైదా, క్వారీ రామారావు, టి.ఇన్నారెడ్డి, గాలి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్‌ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రైల్వే బ్రిడ్జిని తర్వగా పూర్తి చేసేందుకు చర్యలు

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- పిడుగురాళ్ల– జానపాడు బ్రిడ్జికి శంకుస్థాపన



శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల– జానపాడు రైల్వే బ్రిడ్జి నిర్మాణం వేగంగా పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకుడు భవనాశి యల్లారావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం కోసం పిడుగురాళ్ల– జానపాడు ప్రజలకు 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. గతంలో టీడీపీ నాయకులు రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేకుండానే నారా లోకేష్‌తో శంకుస్థాపన చేయించారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రూ.52 కోట్ల నిధులు మంజూరు చేయించారని చెప్పారు. అడ్డంకులు తొలగిన తరువాతే శంకుస్థాపన చేసినట్లు వివరించారు. రాబోయే 18 నెలల్లో రైల్వే బ్రిడ్జి నిర్మాణాని పూర్తి చేసి పిడుగురాళ్ల పట్టణానికి, జానపాడు గ్రామానికి ట్రాఫిక్‌ సమస్యను శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు వివరించారు. దాచేపల్లి, గురజాల మండలాలను మున్సిపాలిటీలు మార్చినట్లు చెప్పా రు. పిడుగురాళ్ల పట్టణంలో 10 వేలకు పైగా తాగునీటి కనెక్షన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పట్టణంలో మూడు అర్బన్‌ హెల్త్‌ సెంటర్లు, 600 పడకల మెడికల్‌ కాలేజీతోపాటు సమస్యగా మారిన బైపాస్‌ సమస్యను పరిష్కరించినట్లు వివరించారు. టీడీపీ హయాంలో యరపతినేని శ్రీనివాసరావు ఒక హాస్పిటల్‌ నిర్మించాడా, ఒక కాలేజీ నిర్మించారా, లేదా పట్టణంలోని ఒక వార్డులోని ఒక ఇంటికి తాగునీటి కనెక్షన్‌ ఇప్పించారా, ఇవేమి చేయాలేదని ఎద్దేవా చేశారు. పట్టణంలోని రైల్వే స్టేషన్‌ రూ.19 కోట్లతో, పిడుగురాళ్ల చెరువును రూ.11 కోట్లతో ఆధునికీకరించినట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, మాజీ ఆర్‌టీఏ కమిషనర్‌ రేపాల శ్రీనివాసరావు ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ కన్వీనర్‌ చింతా వెంకట రామారావు, పల్నాడు జిల్లా మైనార్టీ సెల్‌ అధ్యక్షులు ఎండీ గఫార్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్లు కొమ్ము ముక్కంటి, షేక్‌ జైలాబ్దిన్‌, మార్కెట్‌ యార్డు చైర్మన్‌ కొమెర వెంకటేశ్వర్లు, వైస్‌ ఎంపీపీ సాతులూరి బాబు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకులు ఉన్నం నరసింహారావు, ఉన్నం శ్రీనివాసరావు, కత్తెరపు రాంగోపాల్‌రెడ్డి, పట్టణ యూత్‌ కన్వీనర్‌ మందా సుధీర్‌, జి. పవన్‌రెడ్డి, గున్నంరెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.

రంగోత్సవ్‌ పోటీల్లో 'కొండవీడు' ప్రతిభ

- 9 విభాగాల పోటీల్లో 54 మంది విజేతలు
- గోల్డ్‌, సిల్వర్‌, ట్రోఫీ, మెమెంటోలు కైవసం

యడ్లపాడు: సృజనాత్మక.. నైపుణ్య విభాగ జాతీయస్థాయి పోటీల్లో యడ్లపాడు మండలం విద్యార్థులు సత్తా చాటారు. కొండవీడు గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌ విద్యార్థులు, అదే పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటి పాఠశాలకు మంచి పేరు తెచ్చారు. ముంబాయికి చెందిన స్వచ్ఛంద సంస్థ రంగోత్సవ్‌ పేరిటా 8వ తరగతి వరకు విద్యార్థులకు 9 విభాగాల్లో పోటీలు నిర్వహించింది. ఆర్ట్‌ కాంపిటీషన్స్‌ పేరిటా జాతీయస్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో అంగన్‌వాడీ కేంద్రం ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు పాల్గొని మెడల్స్‌, బహుమతులు సాధించారు. కలరింగ్‌, కోలేజ్‌, గ్రీటింగ్‌ కార్డ్‌ తయారీ, స్కెచ్చింగ్‌, హ్యాండ్‌ రైటింగ్‌, ట్యాటు డిజైన్స్‌, చిత్రలేఖనం పోటీల్లో ఒక్కొక్కరు రెండేసి విభాగాల్లో పాల్గొని తమ ప్రతిభా నైపుణ్యాలను చాటారు. దీంతో 36 మంది విద్యార్థులకు గోల్డ్‌ మెడల్స్‌, 10 సిల్వర్‌ మెడల్స్‌, ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచిన ఇద్దరికీ రెండు ట్రోఫీలు, మరో ఇద్దరికీ కన్సోలేషన్‌ బహుమతులు దక్కాయి. వీరితో పాటు అంగన్‌వాడీ చిన్నారులు నలుగురికి గోల్డ్‌ మెడల్స్‌, ప్రత్యేక బహుమతులు వచ్చాయని పాఠశాల హెచ్‌ఎం గోరంట్ల శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు ఎంతగానో తర్ఫీదు ఇచ్చి, ప్రోత్సహించిన హెచ్‌ఎం శ్రీనివాసరావు, కొత్త సాలన ఎంపీపీఎస్‌ పాఠశాల హెచ్‌ఎం షేక్‌ జున్నుసాహెబ్‌, పాఠశాల ఉపధ్యాయిని షేక్‌ చాందినీ, ఉపాధ్యాయులతోపాటు విజేతలను విద్యార్థుల తల్లిదండ్రులు, ఎంఈఓలు నాగరత్నం, అరుణకుమారి అభినందించారు.

చరిత్రలో నిలిచిపోనున్న జగన్‌ పరిపాలన

- బజరంగ్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- నంబూరులో నిర్వహించిన జగన్నామ సంక్షేమ సంగమం కార్యక్రమానికి స్పందన
- 1413 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో వైద్య పరీక్షలకు హాజరైన వారితో అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిన ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్‌. జగన్‌మోహన్‌ రెడ్డి పాలన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని బజరంగ్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. ప్రజల కలలను, ఆశలను, తన ఆశయాలుగా స్వీకరించి రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమమైన మేనిఫెస్టో రూపొందించడమే కాకుండా నూటికి నూరు శాతం చేయడం ప్రశంసనీయమని తెలిపారు. మండలంలోని నంబూరులో బజరంగ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం కులమతాలు, పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన నేత్రజ్యోతి కంటి పరీక్షలు, గుండె పరీక్షలు, ఫిజియోథెరపీ సేవల్ని 1,413 మంది వినియోగించుకున్నారు. డాక్టర్లు వైద్య పరీక్షల నిర్వహించి వీరిలో 45 మందికి యాంజియోగ్రామ్‌ సూచించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ జగనన్న పేదల ఇంటి ముందుకే సంక్షేమ ఫలాల్ని అందిస్తున్నారన్నారు. ఇది ఒక పవిత్రమైన కార్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో దాన్ని ఆదర్శంగా తీసుకుని బజరంగ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో అంకితభావంతో ప్రజాసేవను కొనసాగిస్తున్నామని తెలిపారు. గత సంవత్సర కాలంగా బజరంగ్‌ జగన్నామ సంక్షేమ సంత్సరంలో కంటి సమస్యల నివారణకై నేత్రజ్యోతి ద్వారా ఉచిత వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఏడు పనిదినాల్లో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మీ గుండె పదిలం కార్యక్రమం ద్వారా ఉచిత గుండె పరీక్షలు, అవసరమైన వారికి యాంజీయోగ్రామ్‌ నిర్వహించి సమస్య ఉన్న వారికి స్టంట్స్‌, బైపాస్‌ సర్జరీలు చేయిస్తున్నట్లు వివరించారు. దివ్యాంగదర్శిని కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, జైపూర్‌ కాళ్లు, వెస్టన్‌ కమోడ్‌లు అందించినట్లు మురళీకృష్ణ తెలిపారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులను వైద్య శిబిరానికి ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించి అదే వాహనంలో ఇంటికి తీసుకు వెళ్లడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు కొనసాగనున్న జగన్నామ సంక్షేమ సంగమ శిబిరం

నంబూరు గ్రామంలో ఆదివారం జరిగిన జగన్నామ సంక్షేమ సంగమ వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పెద్దఎత్తున ప్రజలు తరలి రావడంతో అందరికీ వైద్య సేవలు అందించాలనే ఆశయంతో శిబిరాన్ని సోమవారం కూడా కొనసాగిస్తున్నట్లు మురళీకృష్ణ తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏపీ నర్సింగ్‌ విద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్‌ వినోద్‌కుమార్‌,

గుంటూరు మెడికల్‌: ది ట్రైన్డ్‌ నర్సెస్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా ఏపీ స్టేట్‌ బ్రాంచ్‌ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో 'నర్సింగ్‌ విత్‌ అవుట్‌ బోర్డర్స్‌, ఎక్స్‌ప్లోరింగ్‌ గ్లోబల్‌ ఆపర్చునిటీస్‌' అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్‌ స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌(ఏపీఎస్‌ఎస్‌డీసీ) మేనేజింగ్‌ డైరెక్టర్‌, సీఈఓ డాక్టర్‌ వి. వినోద్‌ కుమార్‌ మాట్లాడుతూ జర్మనీ, జపాన్‌ దేశాలతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. తద్వారా ఏపీ నుంచి నర్సింగ్‌ కోర్సు పూర్తి చేసిన వారు జర్మనీ, జపాన్‌ దేశాల్లో నర్సులుగా మంచి ఉద్యోగం పొందవచ్చన్నారు. విదేశాల్లో ఉద్యోగం కోసం వెళ్లాలనుకునేవారికి స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ ఆర్థిక సాయం చేస్తుందని తెలిపారు. ఏపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 55 నర్సింగ్‌ కాలేజీలను ఎంపిక చేసుకుని విదేశాల్లో ఉద్యోగం చేసేందుకు కావాల్సిన శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఎంత మందిని అయినా పంపిస్తామని, నెలకు వేతనం రెండున్నర లక్షలు ఉంటుందని వెల్లడించారు. ఇండియన్‌ రిసక్షన్‌ కౌన్సిల్‌ ఫెడరేషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ ఎస్‌ఎస్‌సి. చక్రరావు మాట్లాడుతూ బీఎస్సీ, జీఎన్‌ఎమ్‌ నర్సింగ్‌ విద్యార్థులకు లైఫ్‌సేవింగ్‌ కోర్సులో భాగమైన సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్నామని, నర్సింగ్‌ సిబ్బంది దీనిని సద్వినియోగం చేసుకుని ప్రాణాలు కాపాడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ తప్పనిసరిగా నేర్చుకోవాలని తెలిపారు. అమెరికా టెక్సాస్‌ టెక్‌ హెల్త్‌ యూనివర్శిటీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ఎస్‌.ప్రభాకర్‌ శర్మ మాట్లాడుతూ డయాలసిస్‌లో నర్సుల పాత్ర చాలా కీలకమని చెప్పారు. ఏపీ నర్సింగ్‌ డెప్యూటీ డైరక్టర్‌ బి.వల్లీ, అసోసియేషన్‌ అసిస్టెంట్‌ సెక్రటరీ జనరల్‌ అజినాస్‌ మాట్లాడుతూ నర్సింగ్‌ విద్యార్థులకు మన దేశంలో, విదేశాల్లో సైతం ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఏయిమ్స్‌ పాట్నా ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రతీష్‌నాయర్‌ విదేశాల్లో నర్సింగ్‌ అభ్యసించిన వారికి ఉన్న ఉపాధి, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ టీటీకె రెడ్డి, అసోసియేషన్‌ రాష్ట్ర సెక్రటరీ ప్రొఫెసర్‌ కె.సుశీల, ప్రెసిడెంట్‌ ప్రొఫెసర్‌ సీఆర్‌ సంషీర్‌ బేగం, పలు నర్సింగ్‌ కాలేజీల విద్యార్థులు, యూనియన్‌ సభ్యులు హాజరయ్యారు. సదస్సు అనంతరం పలువురు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను అలరించారు.

కమీషన్ల కోసమే నాదెండ్ల మనోహర్‌ రాజకీయాలు

- నిబద్ధతతో పని చేస్తున్న సలహాదారులు
- రాష్ట్ర దేవదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్‌ ఫైర్‌



తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులపై జనసేన పీఏసీ చైర్మన్‌ నాదెండ్ల మనోహర్‌ లేనిపోని రాద్ధాంతం చేయొద్దని రాష్ట్ర దేవదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్‌ హెచ్చరించారు. కొల్లిపరలో ఆదివారం బ్రాహ్మణ భవన్‌ ప్రారంభానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణులకు కల్పిస్తున్న రాజకీయ ప్రాధాన్యతను వివరించారు. ప్రస్తుత ప్రభుత్వంలో కేవలం 46 మందే సలహాదారులు ఉండగా, వీరిలో ఆరుగురు బ్రాహ్మణులున్నట్టు చెప్పారు. జనసేన నేత మనోహర్‌ చేసిన విమర్శలపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, గత టీడీపీ ప్రభుత్వంలో 60–70 మంది సలహాదారులు ఉండేవారని గుర్తు చేశారు. అందులో అమెరికాలో ఉంటున్న పదిమందికి కూర్చోబెట్టి జీతాలిచ్చారని చెబుతూ మనోహర్‌ అప్పుడేం చేశారని? ప్రశ్నించారు. ప్రజల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం నీతి, నిజాయతీ, నిబద్ధతతో సలహాదారులు నడుచుకుంటున్నారని చెబుతూ తనతో సహా కొందరు వేతనం తీసుకోకుండా పనిచేస్తున్నట్టు వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ స్పీకర్‌గా చేసినపుడు మనోహర్‌ శాసనసభ రినోవేషన్‌ పేరుతో అవినీతికి పాల్పడటం, అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి తెలిసిపోవడంతో కాళ్లు పట్టుకోవటం అన్నీ తమకు తెలుసునని శ్రీకాంత్‌ తెలిపారు. కమీషన్ల కోసం రాజకీయం చేయటం మినహా మనోహర్‌ రాజకీయనేత కాదన్నారు మెట్రో రైలు తెనాలికి తీసుకొస్తానని అన్నప్పుడే ఆయన తెలివితేటలు తెలిసిపోయాయని ఎద్దేవా చేశారు.